క్లుప్తంగా

మెరుగైన సేవలే ధ్యేయం

అన్నపురెడ్డిపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయం అని ఎంపీపీ సున్నం లలిత అన్నారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో మండలానికి నూతనంగా ప్రభుత్వం అందించిన 108 వాహనాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. స్థానిక ఎస్సై షాహీన, మండల కోఆప్షన్ బుడేన్, సర్పంచ్ బోడా పద్మ, ఉప సర్పంచ్ వెంకటేశ్వర్లు, వనమా గాంధీ, భీముడు, ఉమ, చల్లా రమేష్, ఈఎంటీ కళాధర్ పాల్గొన్నారు.

పశువులకు మందులు పంపిణీ

దమ్మపేట: మండల పరిధిలోని ముష్టిబండ గ్రామంలో పశువులకు నట్టల నివారణ మందులను బుధవారం పంపిణీ చేశారు. దమ్మపేట పశు వైద్యాధికారి మన్యం రమేష్ మాట్లాడుతూ.. నట్టల మందులను వ్యాధి నిరోధక టీకాల కంటే ముందుగా పశువులకు ఇవ్వాలని, సూచించారు. గాలికుంటు టీకాలను, ఈ నెల 7 నుంచి వేయనున్నామని తెలిపారు.

డీసీఎం- టూవీలర్ ఢీ

గుండాల: ఎదురెదురుగా వస్తున్న డీసీఎం, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మామకన్ను గ్రామానికి చెందిన ఇర్ప జైపాల్, అంబరాసిపల్లి గ్రామానికి చెందిన పాయం సంజీవ్‌లు ద్విచక్ర వాహనంపై గుండాల నుంచి వెళ్తున్నారు. ఇల్లందు వైపు నుంచి డీసీఎం గుండాలకు వస్తోంది. ఈ క్రమంలో తూరబాక వద్ద ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరికి కాళ్లు విరిగాయి. క్షతగాత్రులను గుండాల ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం ఇల్లెందు రిఫర్ చేశారు.

ఈవీఎంలపై అవగాహన

దుమ్ముగూడెం: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలని జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ సూచించారు. బుధవారం రామారావుపేట పంచాయతీలో ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీ ప్యాట్ వినియోగంపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సుబ్బారావుపేట సర్పంచ్ సొందె చిన్నారావు, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో నీరు ఆదా

దమ్మపేట: డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు చేయడం ద్వారా నీటి ఆదాతో పాటుగా, కూలీ ఖర్చులు తగ్గుతాయని సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ పీడీ కృష్ణకిషోర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొడిసెలగూడెం గ్రామంలో, ఐటీసీ వారి సహకారం, సంపూర్ణ గ్రామ స్వరాజ్ స్వచ్ఛంద సంస్థ సూచనలతో.. పెనుబల్లి శేషగిరిరావు అనే రైతు, తన వ్యవసాయ క్షేత్రంలో డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి విత్తనాలు విత్తాడు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ పీడీ మాట్లాడారు. సంస్థ ప్రెసిడెంట్ రమామణి, ప్రాజెక్టు ఆఫీసర్ సతీష్, రంగారావు, రమేష్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు, పర్ణశాల, నర్సాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో డాక్టర్లు పుల్లారెడ్డి, రేణుకారెడ్డి, సుభాష్‌ల ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్ పుల్లా రెడ్డి ఆధ్వర్యంలో ఆర్లగూడెం ఆశ్రమ పాఠశాల, డాక్టర్ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో గౌరారం బాలికల ఆశ్రమ పాఠశాల, డాక్టర్ సుభాష్ ఆధ్వర్యంలో నర్సాపురం గ్రామంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. పరీక్షలను నిర్వహించి రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. సూపర్వైజర్ సాగర్, వి.శ్యామలత, ఏఎన్‌ఎం నర్సమ్మ, గంగమ్మ, సబ్ యూనిట్ ఆఫీసర్ హనుమంతు, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ రామకృష్ణ, ఆశా కార్యకర్త వెంకటరత్నం పాల్గొన్నారు.

పటిష్టం చేయాలి

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్ర చేస్తోందని, ఆ ఆలోచన మానుకుని విద్యారంగాన్ని పటిష్టం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ డివిజన్ కార్యాలయంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో పలు రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు హాజరై మాట్లాడారు. పీడీఎస్‌యు డివిజన్ కార్యదర్శి మునిగెళ్ల శివప్రసాద్, కెచ్చెల కల్పన, గడ్డం స్వామి, సరెళ్ళ నరేష్, నాగేశ్వరరావు, రాజు, రామాచారికొండ చరణ్, దాసరి సాయి పాల్గొన్నారు.

మరమ్మతులు చేయాలి

అశ్వారావుపేటరూరల్: మండలంలోని తిరుమలకుంట గ్రామ సమీపంలోని గుండేటివాగు ప్రాజెక్టును బుధవారం టీపీసీసీ సభ్యురాలు సున్నం నాగమణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎడమ కాలువకు బుంగపడి నీరు వృథా అవుతోందని, ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. తుమ్మ రాంబాబు, ఉప్పల రాజశేఖర్, జుజ్జూరు దుర్గారావు, కొప్పుల శ్రీను, దేవి కనకయ్య ఉన్నారు.

‘తొలిమెట్టు’ శిక్షణ ప్రారంభం

- తెలుగు, ఆంగ్లం, గణితంపై ఫోకస్
- ప్రాథమిక విద్య బలోపేతమే లక్ష్యం
- 8వ తేదీ వరకు తరగతులు



గుండాల: కోర్సును ప్రారంభిస్తున్న హెచ్‌ఎం కిషన్



భద్రాచలంటౌన్: శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎంఓ నాగరాజశేఖర్

దుమ్ముగూడెం: మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులకు తొలి మెట్టు కార్యక్రమంపై రెండు రోజుల శిక్షణను బుధవారం ప్రారంభించారు. విద్యార్థులకు కనీస అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించేందుకు తీసుకొచ్చిన ఈ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 2,3 తేదీల్లో తెలుగు, 4, 5 తేదీల్లో గణితం 7, 8 తేదీల్లో ఆంగ్లంపై శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ శిబిరాన్ని జిల్లా ఏఎంఓ నాగరాజశేఖర్ సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ సున్నం సమ్మయ్య, కోర్స్ డైరెక్టర్లు కేవీ కాంతారావు, రిసోర్స్ పర్సన్‌లు ఏజే ప్రభాకర్, వి శ్రీనివాసరావు, రత్నాకర్, డి.శ్రీనివాస్, కృష్ణార్జున ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుండాల: స్థానిక హైస్కూల్‌లో బుధవారం ఏఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్ కోర్సును హెచ్‌ఎం కిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు వారి వారి అంశాలలో విధిగా హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో మామకన్ను హెచ్‌ఎం మోహన్‌రావు, ఆర్పీలు కృష్ణ, కుమార్, రమేష్, శ్రీరామ్ విజయ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో రెండు రోజుల ఉపాధ్యాయుల శిక్షణ తరగతులను జిల్లా అకాడమిక్ మోటరింగ్ అధికారి నాగరాజశేఖర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పాఠశాలలో ప్రాథమిక విద్యాను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య, రమేష్‌చంద్, వెంకటేష్, రామకృష్ణ, జ్యోతికుమార్, విక్టోరియా మహారాణి, అరుణ, గోపికృష్ణ, రామకృష్ణ పాల్గొన్నారు.

మద్యం షాపులకు ఓకే..



బూర్గంపాడు: గ్రామసభలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి మహేష్

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు పంచాయతీలో మద్యం షాపు ఏర్పాటుకు పెసా గ్రామ సభ ఆమోదం తెలిపింది. బుధవారం నిర్వహించిన గ్రామసభలో 83 మంది పంచాయతీ ప్రజలు పాల్గొనగా వారిలో 74 మంది మద్యం షాప్ కేటాయింపుకు అనుకూలంగా చేతులెత్తి ఆమోదం తెలిపారు. గ్రామ సభలో సర్పంచ్ కల్లూరు దేవి, పంచాయతీ కార్యదర్శి సాహితీ, ఉపసర్పంచ్ తాళ్లూరి ఆదినారాయణ, పెసా ఉపాధ్యక్షుడు సొందె గోపాలకృష్ణ, కార్యదర్శి తుర్రం గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: సారపాకలో ఏ4 మద్యం దుకాణం ఏర్పాటుకు బుధవారం నిర్వహించిన గ్రామసభ ఆమోదం తెలిపింది. గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామసభలో ఈ మేరకు తీర్మాణం చేశారు. సభలో ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ సునీల్, పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు. అయితే గ్రామసభలో గిరిజనులు లేరని తిరిగి సభ నిర్వహించాలని గ్వార్ భాయ్ ట్రైబల్ వెల్ఫేర్ ప్రతినిధులు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ప్రతినిధులు మద్యం దుకాణాలు, బెల్ట్‌షాపుల ఏర్పాటును చేయవద్దని కోరారు.

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని గ్రామ పంచాయతీలో మద్యం దుకాణాల ఏర్పాటుపై బుధవారం డీఎల్‌పీఓ పవన్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. 200 మంది సభలో పాల్గొనగా మెజారిటీ సభ్యుల ఆమోదం మేరకు మద్యం దుకాణాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. అయితే సభలో పాల్గొన్న వారిలో ఎక్కువ మంది బెల్టు షాపుల నిర్వాహకులని, హడావుడిగా సభను నిర్వహించారని విమర్శలు వినిపిస్తున్నాయి.

కరకగూడెం: మండల కేంద్రంలో ఎంపీఓ కుమార్, సర్పంచ్ ఊకే రామనాథం ఆధ్వర్యంలో బుధవారం మద్యం షాపులపై గ్రామ సభను ఏర్పాటు చేశారు. 156 మంది మద్యం షాపు ఉండాలని కోరడంతో కోరం ప్రకారం మద్యం షాపుకు ఏకగ్రీవ తీర్మానాన్ని ఎక్సైంజ్ ఎస్సై రాజేష్ అందజేశారు. అయితే మండల కేంద్రంలోని వైన్ షాపుల్లోని అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉండడం లేదని, బెల్టు షాపులకే సరఫరా చేస్తున్నారని పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్యాం సుందర్, పెసా కమిటీ కార్యదర్శి గొగ్గలి రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రధాని బాధ్యత వహించాలి



అన్నపురెడ్డిపల్లి: ఆర్ఐ మధుకు వినతిపత్రం అందజేస్తున్న పాస్టర్లు

భద్రాచలంఅర్బన్: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసకాండకు దేశ ప్రధాని అసమర్థతే కారణమని, మణిపూర్ సంఘటనకు ప్రధాన మోదీ బాధ్యత వహించాలని సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి డిమాండ్ చేశారు. బుధవారం సుభాష్ నగర్ సీపీఎం జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి జోన్ కన్వీనర్ బెల్లంకొండ కుసుమ అధ్యక్షత వహించగా పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడారు. మూడు నెలల పాటు మణిపూర్‌లో హింసకాండ చెలరేగి ఎంతోమంది ప్రాణాలను బలిగొన్నా.. దేశ ప్రధాని నోరు మెదపకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో కోమల, కుమార్ స్వామి, చిన్న నూకరత్నం, రఘు, ఉష, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

అన్నపురెడ్డిపల్లి: మణిపూర్‌లో దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని అన్నపురెడ్డిపల్లి పాస్టర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో జరిగిన అమానుష దాడులకు నిరసనగా మండల కేంద్రంలో పాస్టర్ల ఆధ్వర్యంలో బుధవారం శాంతి ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ మధుకు.. మాణిపూర్‌లో కేంద్ర ప్రభుత్వం శాంతిభద్రతలను కాపాడాలని వినతిపత్రం అందించారు. శాంతి ర్యాలీకి గ్రామ సర్పంచ్ బోడా పద్మ సంఘీభావం ప్రకటించారు. కార్యక్రమంలో పాస్టర్లు మరియరాజు, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వితరణ



రూ.2 లక్షల విలువైన వితరణ సామగ్రితో వ్యాపారులు

గుండాల: వర్షాలకు ముంపునకు గురైన గ్రామాల్లో బాధిత కుటుంబాలకు రూ. 2 లక్షల విలువైన వస్తువులను మండల కేంద్రానికి చెందిన వ్యాపారి మానాల వెంకటేశ్వర్లు, ఇల్లెందు, ఆళ్లపల్లి వ్యాపారులు అందించారు. మండలంలోని సాయనపల్లి, నర్సాపురం గ్రామాలను సందర్శించిన వ్యాపారులు దుస్తులు, దుప్పట్లు, బియ్యం, ఆరు ఇళ్ల నిర్మాణానికి రేకులు, పైపులు, ఎరువులు, వంట పాత్రలు అందించారు. ఈ సందర్భంగా ఇల్లెందు డివిజన్ ఫెర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాలా సోమ సుందర్, గుండాల వ్యాపార వేత్త మానాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. తాటిపల్లి నర్సింహరావు–నాగసుధ దంపతులు, అమెరికాలో ఉంటున్న తాటిపల్లి సతీష్‌లు రూ. 25వేల ఎరువులు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మానాల నారాయణ మూర్తి, మానాల వీరన్న, మానాల ప్రభాకర్, గౌరిశెట్టి శ్రీనివాస్, అనుమోలు వెంకటేశ్వర్లు, వ్యాముసాని జనార్ధన్, సంది రమేష్, ఆదిత్య నాగేశ్వరావు, కన్యకంటి అనీల్‌కుమార్, మానాల ప్రణీత్, హనుమాన్ వ్యాపారి, సత్యనారాయణ నాగార్జున, పవన్, అప్పారావు, నర్సింహులు, నాగరాజు, వాగబోయిన రమేష్, తోలెం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

50 కుటుంబాలకు..

ముంపునకు గురైన ముత్తాపురం ముక్తి గుంపు గ్రామంలో బుధవారం సమరిటన్స్, చేతన్ ఫౌండేషన్ స్వచ్ఛం సంస్థల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామంలో 50 కుటుంబాలకు బియ్యం, కూరగాయలు పంపిణీ చేసినట్లు ఆ సంస్థల అధ్యక్షులు అనీల్ కుమార్, రామ్‌కుమార్‌లు తెలిపారు. కార్యక్రమంలో అజ్జు, సత్తులాల్, చంద్రకాని, నవీన్, రషీద్, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి..

భారీ వర్షాలకు నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ముంపునకు గురైన సాయనపల్లి, ముత్తాపురం, నర్సాపురం గ్రామాలను పార్టీ ఆధ్వర్యంలో సందర్శించి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, సర్పంచ్ కొమరం సీతారాములు, నాయకులు పాల్గొన్నారు.

7న విద్యార్థుల ఎంపిక

గుండాల: మండలంలోని కాచనపల్లి బాలికల క్రీడా పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్లలో భాగంగా 7వ తేదీన విద్యార్థుల ఎంపిక జరుగుతుందని హెచ్‌ఎం బి.శారద బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 18 సీట్లు, 8వ తరగతిలో 2, 9వ తరగతిలో 2సీట్లు ఖాళీ ఉన్నాయని తెలిపారు. ఇదే పాఠశాల ఆవరణలో ఫిజికల్ టెస్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల బాలికలు ఆధార్ కార్డు, పాస్ పొటో, స్టడీ సర్టిఫికెట్లతో పాఠశాలలో హాజరు కావాలని సూచించారు.

సీఐ బాధ్యతలు స్వీకరణ

మణుగూరురూరల్: మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐగా బాలాజీ వరప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విప్ రేగాను మర్యాదపూర్వకంగా కలిశారు.

చెక్కు అందజేత

మణుగూరురూరల్: మండల పరిధిలోని విప్పలసింగారం గ్రామానికి చెందిన పి.జ్యోతికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.14వేల చెక్కును ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు బుధవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముత్యం బాబు, వట్టం రాంబాబు, ముద్దంగుల కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని గోళ్లగట్ట రోడ్డు కారుణ్య చైల్డ్ కేర్ సెంటర్‌లో బీసీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం సుమారు 45 మంది విద్యార్థులకు బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ రాష్ట్ర నిర్వాహకుడు మచ్చా వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో బండారు శరత్‌బాబు, గడ్డం స్వామి, సున్నం గంగా, లక్ష్మీకాంత్, రామరాజు, సునీల్ పాల్గొన్నారు.

పుస్తకాలు వితరణ

మణుగూరురూరల్: మండలంలోని అశోక్‌నగర్‌లోని మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మణుగూరు వాసవిక్లబ్, వనితావైభవం క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వాసవిక్లబ్ డిస్ట్రిక్ట్ కేసీజీఎఫ్ ఇన్‌చార్జ్ బండారు నరసింహారావు, జోన్ చైర్మన్ దింటకుర్తి బ్రహ్మయ్య, క్లబ్ అధ్యక్షుడు చిట్లూరి శేషకుమార్, సముద్రాల కృష్ణమూర్తి, వనితా వైభవం కార్యదర్శి స్వర్ణలత, కోశాధికారి బండారు మానస, హెచ్‌ఎం కిషోర్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

దుమ్ముగూడెం: ఐఐటీ పాట్నాలో సీటు సాధించిన కాటాయిగూడెం గ్రామానికి చెందిన విద్యార్థిని కొర్సా లక్ష్మికి అదే గ్రామానికి చెందిన కోడి లక్ష్మయ్య, కోడి వెంకటేశ్వరరావు, శీలం వీరస్వామి, గాజుల నాగరాజు, కుంజ రామరావు, కొర్స అరుణ, కోర్సా రమేష్ కుటుంబాలు రూ.20వేలు, కొర్స సమ్మమ్మ రూ.2వేలు, నర్సాపురం పీహెచ్‌సీ స్టాఫ్ నర్స్ మాధవి రూ.5వేలు ఆర్థిగా సాయం అందజేశారు. మెత్తం రూ. 27వేలు అందించారు.

భవనం కూల్చివేత

అశ్వారావుపేట: అశ్వారావుపేట మేజర్‌పంచాయతీ కార్యాలయ భవనాన్ని బుధవారం కూల్చివేశారు. నూతనంగా గదుల నిర్మించడానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి రూ.25 లక్షలు మంజూరు కావడంతో సర్పంచ్, ఈఓ, కార్యాలయ సిబ్బంది పాత కార్యాలయాన్ని బుధవారం కూల్చేశారు.

ఎమ్మెల్యేకు వినతి

ములకలపల్లి: ములకలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ అధ్యాపక బృందం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావుకు వినతిపత్రం అందజేసింది. ఇందుకుగాను రూ.10 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో లెక్చరర్లు చవ్వా రాజేశ్వరి, శెట్టి చంద్రశేఖర్, బుర్రి కుమారస్వామి, మైలగాని చంద్రశేఖర్ ఉన్నారు.

తల్లిపాల వారోత్సవాలు



ములకలపల్లి: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నాగమణి

అశ్వారావుపేట: ప్రపంచ తల్లిపాల వారోత్సావాల్లో భాగంగా అశ్వారావుపేటలోని వడ్డెరబజార్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆరుగురు గర్భవతులకు సామూహిక సీమంతాలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సూపర్‌వైజర్ కె.విజయలక్ష్మి తల్లిపాలు, ముఖ్యంగా ముర్రుపాల ప్రాముఖ్యతను వివరించారు. పోషణ అభియాన్ కోఆర్డినేటర్ సుజాత, ఎంపీటీసీ భారతి, ఆరోగ్య సిబ్బంది రాణి, సరస్వతి, నాగమ్మ, ఇందు, పావతి పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని బచ్చువారిగూడెం గ్రామంలో బుధవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగా భవాని పాల్గొని మాట్లాడారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేసి, వాయనాలు అందించారు. సూపర్‌వైజర్ సౌజన్య, అంగన్‌వాడీ టీచర్లు రజని, విజయకుమారి, లావణ్య, చెల్లెమ్మ, విజయశాంతి పాల్గొన్నారు.

ములకలపల్లి: జీపీ పరిధిలోని కొత్తగంగారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా ఐసీడీఎస్ జగన్నాథపురం సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు వెంకటమ్మ, సరోజిని, జీపీ సెక్రటరీ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

విప్ రేగాకు వినతుల వెల్లువ

మణుగూరురూరల్: పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావుకు వివిధ సంఘాలు, అసోసియేషన్ల నుంచి వినతులు అందాయి. తమకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత, కొలువు పర్మినెంట్, కారుణ్య నియామకాలు, డబుల్ బెడ్‌రూమ్‌లు తదితర డిమాండ్లతో జిల్లా హోంగార్డుల అసోసియేషన్ వారు వినతిపత్రం అందజేశారు. వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మాణం చేసి కేంద్రానికి పంపాలని వడ్డెర సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. అంగన్‌వాడీలకు వేతనం పెంపు, పదోన్నతులు, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు, పెండింగ్ బకాయిల చెల్లింపు తదితర డిమాండ్లతో ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు విన్నవించారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం, ఇతర సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో విప్ రేగా కాంతారావు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వినతిపత్రాలు అందించిన ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అశ్వాపురం: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావును అంగన్‌వాడీ టీచర్లు కోరారు. ఏఐటీయూసీ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి అరుణ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో బుధవారం రేగాకు వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, అక్కి నరసింహారావు, తోట రమేష్, కోరెం శ్రీలత, మడకం అరుణ, రాజేశ్వరి అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలి

దుమ్ముగూడెం: మండలంలో గిరిజన రైతుల ఆధీనంలో ఉన్న అసైన్డ్ భూములకు పట్టాలిప్పించాలని మండల ప్రజాప్రతినిధులు, నాయకులు ఎంపీపీ రేసు లక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ విప్ రేగా కాంతారావును కలిసి కోరారు. ఆ భూములకు సంబంధించిన సర్వే నంబర్ల నకళ్లను ఆయనకు అందజేశారు. పెదనల్లబల్లి గ్రామంలో అప్పటి పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం కారణంగా ఆన్‌లైన్ అవ్వని పోడు భూములకు సైతం పట్టాలు పట్టాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి కణితి రాముడు, పార్టీ అధికార ప్రతినిధి జానిపాషా, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఇర్పా చంటి, సర్పంచ్‌లు మట్టా వెంకటేశ్వరావు, సోడే జ్యోతి, సుమిత్ర, ఎంపీటీసీ తెల్లం భీమరాజు, నాయకులు పాల్గొన్నారు.

రేగాకు సన్మానం..

మణుగూరురూరల్: పెరిక సంఘం కమ్యూనిటీహాల్ భవన నిర్మాణానికి టెండర్ పిలిపించినందుకుగాను పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావుకు సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలియజేస్తూ.. బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెరిక సంఘం నాయకులు చిట్టి వెంకటేశ్వర్లు, కటకం గణేష్, చిట్టి మల్లేష్, తిప్పని శ్రీనివాసరావు, బొలిశెట్టి కృష్ణార్జునరావు, బుస్సీ శ్రీను, అటిక బిక్షం, బండారు వెంకన్న, డాక్టర్ బుడగం రామకృష్ణ, చిట్టి శ్రీనివాసరావు, పూజారి కృష్ణ, ఆకుల సత్యనారాయణ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన లయన్స్‌క్లబ్



మణుగూరురూరల్: అంగన్‌వాడీ కేంద్రంలో బ్యాగులు అందజేస్తున్న లయన్ క్లబ్ బాధ్యులు

అశ్వారావుపేట: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం అశ్వారావుపేట గౌతమి స్కూల్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు దూపగుంట్ల దుర్గారావు, కొఠారు చలపతి రావు, కోటగిరి మోహన్‌రావు, జూపల్లి బ్రహ్మారావు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బ్యాగులు పంపిణీ

మణుగూరురూరల్: మండలంలోని బండారుగూడెం–5 అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, పలకలు, చాపలు, టీచర్ల కోసం రెండు కుర్చీలను సుందరయ్యనగర్ పల్లె దవాఖానా డాక్టర్ అనీషా చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గాజుల పూర్ణచందర్‌రావు, కార్యదర్శి మీరాహుస్సేన్, సభ్యులు ముత్తంశెట్టి నాగేశ్వరరావు, ఏఎన్‌ఎం నాగజ్యోతి, సహాయకురాలు జ్యోతి, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

దమ్ము చక్రాలతో తిరిగితే చర్యలు

అశ్వాపురం: దమ్ముచక్రాల ట్రాక్టర్లు రోడ్లపై తిరిగితే కోట్ల రూపాయలతో నిర్మించిన రోడ్లు ధ్వంసం అవుతున్నాయని, అలా తిరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని అశ్వాపురం సీఐ రవీందర్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతన సీఐ రవీందర్ బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దమ్ము చక్రాల ట్రాక్టర్లు రోడ్లపై కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రాత్రి సమయాల్లో పోకిరీలు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈ నేపథ్యంలో పెట్రోలింగ్ నిర్వహించి చర్యలు తీసుకుంటామని అన్నారు. రాత్రి సమయాల్లో ప్రజలకు ఇబ్బంది కలిగితే వెంటనే సమాచారం అందిచాలని సూచించారు.

క్రీడా సామగ్రి రాక..

అశ్వారావుపేటరూరల్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అవసరమైన క్రీడా సామగ్రి ఎట్టకేలకు బుధవారం అందుబాటులోకి వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఈజీఎస్ నిధులతో గ్రామ పంచాయతీకి ఒకటి చొప్పున క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయగా.. తాజాగా క్రీడా సామగ్రి స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చేరింది. ఈ కిట్లను త్వరలోనే ప్రతి పంచాయతీ కార్యదర్శులకూ అందిస్తామని ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు.

పోరాటాన్ని ఉధృతం చేస్తాం



అశ్వారావుపేట: బతుకమ్మ ఆడుతూ నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

భద్రాచలంఅర్బన్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని జిల్లా జేఏసీ చైర్మన్ ఏజే రమేష్ స్పష్టం చేశారు. భద్రాచలం గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట బుధవారం ప్రారంభమైన సమ్మెలో భాగంగా.. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యురాలు మర్లపాటి రేణుక అధ్యక్షతన సభ నిర్వహించారు. ఏజే రమేష్ మాట్లాడుతూ.. వరదలను దృష్టిలో ఉంచుకుని విధులకు హాజరైన కార్మికులు.. వరదలు తగ్గాక బుధవారం నుంచి తిరిగి సమ్మెలో పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ఆకోజుసునీల్ కుమార్ మాట్లాడారు. సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పట్టణ ప్రముఖ లాయర్ పి.తిరుమలరావు, సీపీఎం పట్టణ కార్యదర్శులు సభ్యులు బండారుశరత్ బాబు, సీఐటీయూ, ఏఐటీయూసీ, డివైఎఫ్ఎస్ఐ, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గుండాల: పంచాయతీ కార్మికుల విషయంలో ప్రభుత్వం మొండి వైఖరిని ప్రదర్శిస్తోందని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి, రాష్ట్ర నాయకుడు డి.ప్రసాద్‌లు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మెకు బుధవారం సంఘం తరుపున వారు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కందకట్ల సురేందర్, ఏరియా కమిటీ కార్యదర్శి యాసారపు వెంకన్న, గొని నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట: పంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా బుధవారం 28వ రోజుకు చేరిన సందర్భంగా కార్మికులు బతుకమ్మలాడి నిరసన తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మట్లకుంట కామేశ్వరావు, మూల అప్పన్న, విజయ్, మహేష్, భూషణం, బుజ్జమ్మ, దీనమ్మ, రాణమ్మ, రూపమ్మ, తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల చెన్నయ్య బుధవారం సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. టీడీపీ ఆధ్వర్యంలో కార్మికులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. జీపీ కార్మికులు అవులూరి రాంబాబు. గంటా శ్రీను, చిక్కాల శ్రీను, వర్మా రుక్మాంగధరరావు, సాయిరత్న తదితరులు పాల్గొన్నారు.